www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 55
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే.ఉ.6.28, దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36, రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45 | హైదరాబాద్ సిటీ*
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

56 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 9: తాండూరు రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడి నుంచి 56 కిలోల గంజాయిని వికారాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. జనరల్ చెకింగ్‌లో భాగంగా వికారాబాద్, తాండూరు ఆర్పీఎఫ్ శక్తిటీం మహిళా కానిస్టేబుళ్లు ఆదివారం రాత్రి తాండూరు చేరుకున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేస్తున్నారు. ఒడిశాకు చెందిన సంజిత్‌కుమార్ భూయాన్ (24) ప్రయాణికుడిపై అనుమానం రావడంతో అతని వద్ద ఐదు లగేజీ బ్యాగులను తనిఖీలు చేయగా రూ. 14 లక్షల విలువ చేసే 56 కిలోల గంజాయి లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

వికారాబాద్, జూన్ 9 :ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత కలెక్టర్‌లో సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజవాణి కార్యక్రమాన్ని తిరిగి కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలుప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సాగు సంబురం

● వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతన్నలు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వానాకాలం సాగు జోరందుకుంది. సీజన్‌కు ముందే నైరుతి రుతుపవనాలు పలకరించడంతో తొలకరి పలకరింపుతో నేలతల్లి పులకరిస్తోంది. ఇటీవలి వర్షాలకు అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై బిజీగా గడుపుతున్నారు. వ్యవసాయ పరికరాలు సమకూర్చుకోవడంపై దృష్టి సారించారు. దుక్కులు దున్నుకోవడం, విత్తనాలు, ఎరువుల కొనుగోలు, నారుమడుల ఏర్పాటు తదితర పనుల్లో నిమగ్నమయ్యారు.


రుద్రారంలో విత్తనాలు వేస్తున్న రైతులు


కొడంగల్‌లో...


ధారూరు సమీపంలో పొలంలో కట్టె ఏరుతున్న కూలీలు


కొడంగల్: ఆటోలోఎరువులు తీసుకెళ్తున్న రైతులు


బొంరాస్‌పేట్‌లో కాడెద్దుల ముస్తాబు

ఎడతెరపి లేకుండా..

● జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం...తాండూరులో కూలిన ఇంటి పైకప్పు



ధారూరులో కురుస్తున్న వర్షం, తాండూరులో కూలిన ఇంటికప్పు

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/తాండూరు/పెద్దేముల్/వికారాబాద్/ధారూరు, జూన్9: వికారాబాద్ జిల్లాలో ఆదివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షం కురియడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు వ్యవసాయ పనులకు సన్నాహాలు చేసుకుంటున్నారు. జిల్లాలో ఆదివారం కురిసిన వర్షానికి అత్యధికంగా యాలాల్ మండలంలో 65.3మి.మీ. వర్షం కురిసింది. తాండూరులో 41.8 మి.మీ, పెద్దేముల్ లో 35.8మి.మీ, దోమలో 28.5 మి.మీ, బొంరాస్‌పేట్ లో 28.3మి.మీ, ధారూరులో 21.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. కోట్‌పల్లిలో 12.0మి.మీ, మర్పల్లిలో 7.5 మి.మీ, పరిగిలో 5.8మి.మీ, బంట్వారంలో 4.0 మి.మీ., వికారాబాద్ లో 3.0 మి.మీ., దుద్యాల్ లో 3.0 మి.మీ., కొడంగల్ లో 2.5 మి.మీ, దౌల్తాబాద్ లో 2.5 మి.మీ, కులకచర్ల లో 2.0 మి.మీ, నవాబ్‌పేట లో 1.3 మి.మీ, పూడూరులో 0.8మి.మీ వర్షం కురిసింది. తాండూరులో రెండు రోజులుగా భారీ వర్షాలు కురువడంతో రోడ్లన్నీ చింతడిగా మారాయి. తాండూరు పట్టణంలో ఆదివారం పట్వారి వార్డులోని బిచ్చలం మల్లేష్ ఇంట్లో తాండూరు మండలం కొటబాస్పల్లికి చెందిన యాదగిరి కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. వర్షానికి ఒక్కసారిగా ఇంటి పై కప్పు కూలిపోవడంతో ప్రమాదంలో యాదగిరికి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. పట్టణంలో గంట పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పంది. పెద్దేముల్ మండలంలో ఆదివారం జోరుగా వాన కురిసింది. ముందుగానే దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు వర్షాలకు పంటవిత్తనాలు విత్తుకున్నారు. వికారాబాద్ పట్టణంలో మోస్తరు వర్షం కురిసింది. వికారాబాద్ పట్టణంతో పాటు మండలంలో ఆయా ప్రాంతాల్లో వర్షంపడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ధారూరు మండలంలోని పలు గ్రామాల్లో మృగశిర కార్తె ప్రవేశించిన తర్వాత తొలకరి వాన కురియటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేముల్ మండలంలో పొలాల్లో నిలిచిన నీరు

వీరిద్దరికే పొగ

రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్ల బదిలీలకు ఒత్తిళ్లు

మరికొందరు తహసీల్దార్ల బదిలీలకు యత్నాలు

భూ వ్యవహారాల్లో మాట వినకపోవడమే కారణం

తెర వెనుక నుంచి కథ నడుపుతున్న బడా వ్యక్తులు


రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు శశాంక, గౌతమ్



ఉమ్మడి జిల్లాలో తమ మాట వినని అధికారులను సాగనంపేందుకు రాజకీయ నేతలు తెరచాటుగా పావులు కదుపుతున్నారు. మరికొందరు బడా నేతలు శివార్లలోని కొన్ని భూముల వ్యవహారాల్లో తమకు ఇద్దరు కలెక్టర్లు అనుకూలంగా వ్యవహరించడం లేదని గుర్రుగా ఉన్నారు. కీలకమైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పాలన గుప్పిట్లో పెట్టుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో పాటు గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వ్యక్తులు వీరి బదిలీకి తెర వెనుక తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బడా నేతలు, వ్యాపారులు, కొందరు మంత్రులను కలిసి కలెక్టర్లు శశాంక, గౌతమ్‌ల బదిలీల కోసం ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 9): ఎన్నికలు ముగియడంతో అధికారయంత్రాంగం పాలన వ్యవహారాలపై దృష్టిసారిస్తోంది. అయితే ఇదే సమయంలో కీలకమైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పాలన గుప్పెట్లో పెట్టుకునేందుకు రాజకీయశక్తులు ఏకమవుతున్నాయి. తమ మాటవినని అధికారులను సాగనంపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్లతో పాటు కీలక పోస్టుల్లో ఉన్న రెవెన్యూ అధికారులను బదిలీ చేయనున్నట్లు తాజాగా ప్రచారం సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ ఆదేశానుసారంగా జరిగిన బదిలీల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ ఇక్కడ నియమితులైన విషయం తెలిసిందే. వీరిద్దరి పనితీరు బాగానే ఉండడంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తరువాత వీరిద్దరినీ కొనసాగించింది. అయితే భూవ్యవహారాలకు సంబంధించిన విషయాల్లో ఇద్దరు కలెక్టర్లు కొంత కఠినంగానే వ్యవహరిస్తున్నారు. దీంతో కొందరు పెద్దలకు వీరు కొరగాని కొయ్యగా మారారు. ఒకవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకుంభకోణాలను తవ్వడమే కాకుండా మరో వైపు ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేసుకుంటూపోతున్నారు. గతంలో ధరణి ముసుగులో జరిగిన అక్రమాలను కూడా వెలికి తీస్తున్నారు. దీంతో వీరిద్దరి వ్యవహారం కొందరికి నచ్చడం లేదు. శివార్లలో గతంలో జరిగిన ఓ భూకుంభకోణాన్ని వెలికితీస్తున్న అధికారులను కొన్నాళ్ల పాటు ఈ కేసు జోలికి వెళ్లొదంటూ ఓ అమాత్యుడి నుంచి గట్టిగా ఆదేశాలు వచ్చాయి. దీంతో ఈ కేసు వ్యవహారాన్ని కొన్నాళ్లుగా పక్కన పెట్టారు. మరో వైపు మరికొందరు బడా నేతలు శివార్లలోని కొన్ని భూముల వ్యవహారాల్లో తమకు ఇద్దరు కలెక్టర్లు అనుకూలంగా వ్యవహరించడం లేదని గుర్రుగా ఉన్నారు. వీరంతా ఇప్పుడు ఇద్దరు కలెక్టర్ల బదిలీకి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. బడా నేతలు, వ్యాపారులు కొందరు మంత్రులను కలిసి మేడ్చల్, రంగారెడ్డిజిల్లా కలెక్టర్ల బదిలీల కోసం వత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.



తహసీల్దార్ల బదిలీలకు పట్టు...

అలాగే ఇద్దరు కలెక్టర్లతోపాటు శివార్లలో కీలక రెవెన్యూ పోస్టుల్లో ఉన్న అధికారుల బదిలీల కోసం కూడా తెరచాటుగా పావులుకదుపుతున్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరు పెద్దలతో పాటు గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వ్యక్తులు వీరి బదిలీకి తెర వెనుక తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కొందరు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో బదిలీలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. వీరి స్థానంలో తమకు అనుకూలమైన అధికారులను తెచ్చుకునేయత్నాలు సాగుతున్నాయి. కలెక్టర్లతో పాటు శివార్లలోని పని చేస్తున్న ముగ్గురు తహసీల్దార్ల బదిలీలకు కొందరు పట్టుబడుతున్నారు. రాజకీయ, వ్యాపారుల వత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గితే రేపో మాపో వీరి బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే అధికారుల బదిలీల ప్రచారం జరుగుతుండడంతో కొందరు ఈ పోస్టుల్లోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రంగారెడ్డిజిల్లా కలెక్టర్ పోస్టు కోసం ముగ్గురు గట్టిగానే పైరవీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇందులో పొరుగు జిల్లాకు చెందిన కలెక్టర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఒకవేళ ఇక్కడ వీలుకాకుంటే మేడ్చల్‌లో అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నట్లు సమాచారం. అలాగే మరో మహిళా అధికారి పేరు కూడా వినిపిస్తుంది. ఆమె తరుపున పెద్ద ఎత్తున రాజకీయ లాబీయింగ్ నడుస్తోంది. ఇదిలా ఉంటే అనేక మండలాల్లో కొత్త తహసీల్దార్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ అయిన కొందరు తహసీల్దార్లు తిరిగి ఇక్కడకు వచ్చి శివార్లలో పోస్టింగ్‌లు పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశాంతం

● జిల్లాలో 78.21 శాతం హాజరైన అభ్యర్థులు
● ఆలస్యంగా వచ్చిన 28 మందిని అనుమతించని అధికారులు
● మేడ్చల్ జిల్లాలో 20,765 మంది గైర్హాజరు
● కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు, అధికారులు

వికారాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లాలో 13 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 5468 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 4277 మంది అభ్యర్థులు హాజరు కాగా, 1191 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు వికారాబాద్‌లో 7, తాండూరులో 4, పరిగిలో 2 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 78.21 శాతం హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి అనుమతించారు. ఇంతకు ముందు జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల్లో చోటు చేసుకున్న అవాంఛనీయ సంఘటనల దృష్ట్యా టీజీపీఎస్సీ పకడ్బందీ చర్యలు తీసుకుంది. అభ్యర్థులను తనిఖీ చేసిన తరువాతనే లోపలికి పంపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా యంత్రాంగం ముందుగానే పకడ్బందీ చర్యలు తీసుకుంది. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సాయి డెంటల్ కాలేజ్ ఆఫ్ సర్జరీ, సిద్ధార్థ జూనియర్ కళాశాల, ఎస్‌ఏపీ కళాశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించారు. అభ్యర్థులు, సిబ్బంది హాజరు గురించి ఆయన కేంద్రాల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను అయన అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ కోటిరెడ్డి సిద్ధార్థ, గౌతమి జూనియర్ కళాశాలలు, భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ విశ్వభారతి డిగ్రీ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, కొత్తగడిలోని టీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐ పాఠశాలను సందర్శించి పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణ పూర్తయిందని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో వసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అమరేందర్ కృష్ణ పాల్గొన్నారు.



సాయి కాలేజీలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్‌ఏపీ కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

ఆలస్యంగా వచ్చి...

జిల్లాలో ఆదివారం జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు నాలుగు నిమిషాలలోపు ఆలస్యంగా వచ్చిన 28 మంది విద్యార్థులు పరీక్ష రాసే అవకాశం కోల్పోయారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో 20 మంది విద్యార్థులు ఆలస్యంగా రాగా, తాండూరులో 8 మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాయలేకపోయారు. వికారాబాద్ పట్టణంలో ఎస్‌ఏపీ కళాశాల కేంద్రానికి 12 మంది, విశ్వభారతి కళాశాలకు 4, గౌతమి కళాశాలకు 4 అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. వికారాబాద్ పట్టణంలో నుంచి ఎస్‌ఏపీ కళాశాల వెళ్లే మార్గంలో రైలు వెళ్లేంత వరకు రైల్వే గేట్ వేయడంతో ఆలస్యమై నలుగురు అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రానికి చేరుకోలేకపోయారు. రైల్వే గేట్ పడిన సమయంలో అక్కడ పరీక్షకు హాజరయ్యేందుకు వెళ్లాల్సిన అభ్యర్థుల్లో ఇద్దరిని నాగిరెడ్డి అని యువకుడు తన బైక్‌పైన పరీక్ష కేంద్రం వద్దకు చేర్చారు. మళ్లీ వచ్చి మరో ఇద్దరినీ తన బైక్‌పైన తీసుకు వెళ్లే సరికి సమయం 10 గంటలు దాటడంతో మెయిన్ గేట్‌లో నుంచి లోపలికి అనుమతించలేదు. ఆ తరువాత వచ్చిన మరో 8 మంది అభ్యర్థులను కూడా నిర్వాహకులు వెనక్కి పంపించారు. ఇదిలా ఉంటే, తాండూరు పట్టణంలో రెండు కేంద్రాల్లో మూడు నిమిషాల లోపు ఆలస్యంగా వచ్చిన 8 మంది అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు.ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు ఆలస్యంగా వచ్చి పరీక్ష రాసే అవకాశం కోల్పోవడంతో ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

మేడ్చల్ జిల్లాలో...

గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షకు మేడ్చల్ జిల్లాలో 48,962 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఆదివారం నిర్వహించిన గ్రూప్ - 1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 105 కేంద్రాలు కేటాయించారు. మొత్తం 69,727 అభ్యర్థులకు గాను 48,962 మంది పరీక్షకు హాజరు కాగా 20,765 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను సందర్శించారు.


మేడ్చల్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

పరీక్ష రాసి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో కార్యదర్శి మృతి

ధారూరు/బొంరాస్‌పేట, జూన్ 9: వికారాబాద్ జిల్లా కేంద్రంలో గ్రూపు-1 పీరీక్ష రాసి తిరిగి వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి మోటార్‌సైకిల్ పై నుంచి కిందపడి మృతి చెందింది. బొంరాస్‌పేట్ మండలం, దేవ్లనాయక్ తండాకు చెందిన సుమిత్రబాయి(32), నెహ్రూనాయక్‌లు దంపతులు. వీరు కుంటుంబంతో కలిసి తాండూరులో అద్దె ఇంట్లో ఉంటున్నారు. అయితే సుమిత్రబాయి యాలాల మండలం, అచ్యుతాపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుంది. కాగా గ్రూపు-1 పరీక్షకు హాజరయ్యేందుకు ఆదివారం ఉదయం ఆమె, భర్త నెహ్రూనాయక్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై వికారాబాద్‌కు వచ్చింది. గ్రూప్-1 పరీక్ష రాసిన అనంతరం దంపతులిద్దరు తిరిగి బైక్‌పై తాండూరుకు తిరుగుప్రయాణమయ్యారు. ధారూరు దాటిన తర్వాత గట్టేపల్లి గేట్ సమీపంలో ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ పై నుంచి సుమిత్ర బాయి కిందపడి తలకు తీవ్ర గాయాలైనాయి. ఆమెను వెంటనే తాండూర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నామనిఎస్‌ఐ తెలిపారు.



గొడుగే ప్రమాదానికి కారణమా?

కాగా ఈ ప్రమాదానికి గొడుగే కారణమని పోలీసులుఅనుమానిస్తున్నారు. సుమిత్రబాయి దంపతులు మోటార్‌సైకిల్‌పై తాండూరుకు వెళ్తున్న సమయంలో గట్టేపల్లి వద్దకు రాగానే గాలితో కూడిన వర్షం చినుకులు మొదలయ్యాయి. దీంతో బైక్ వెనుక కూర్చున్న సుమిత్రబాయి గొడుగు తీసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో గాలివానకు గొడుగుతో పాటు సుమిత్ర బాయి బైక్‌పై నుంచి కింద పడి తలకు తీవ్ర గాయాలైనట్లు అనుమానిస్తున్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కానివ్వద్దు

● అధికారులకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశం

● నేడు విచారణ జరిపి బోర్డు పాతిస్తాం : ఆర్డీవో

● స్థలాన్ని రక్షించాలని కోరుతూ ఆందోళనకు సిద్ధమైన బీఆర్ఎస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 9 : తాండూరు పట్టణంలో విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన గల రూ.10కోట్ల విలువచేసే స్థలం అన్యాకాంత్రంపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమి గజం స్థలం కూడా అన్యాక్రాంతం కావద్దని, వెంటనే విచారణ జరిపి చర్యలు చేపట్టాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆర్డీవోను ఆదేశించారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లొంగరాదని ఎమ్మెల్యే ఆదేశించారు. శాసనసభ ఎన్నికలకు ముందు మనోహర్‌రెడ్డి తన ప్రచారంలో భాగంగా 7వ గ్యారంటీ కింద తాండూరులో కబ్జాలు, అక్రమ వ్యాపారం నిర్వహిస్తే ఉక్కుపాదంతో అణిచి వేస్తానని చెప్పారు. అదే మాట ప్రకారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, సోమవారం వెంటనే పంచనామా చేసి ప్రభుత్వ స్థలం అనే బోర్డు పాతిస్తామని ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇప్పటికే ఆ స్థలంపై వచ్చిన ఫిర్యాదులు, రికార్డులు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆర్డీవో కార్యాలయం ఎదుటనే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కావడంపై రెవెన్యూ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ స్థలం పరిరక్షణకై బీఆర్ఎస్ శ్రేణుల సోమవారం ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. ఈమేరకు ఆదివారం ఆ పార్టీ శ్రేణులు సమావేశమయ్యాయి. ఇదిలా ఉంటే విజయ విద్యాలయ క్రీడాస్థలం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ బుధవారం అత్యవసర సమావేశం అవుతోంది. మేనేజ్‌మెంట్ కమిటీలో కొందరు ఈ స్థలం కబ్జాకు యత్నించడంతో అందులో ఉన్న మరికొందరు సభ్యులు నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నాయకులు స్థలాన్ని రక్షించాలని కోరు తూ పోరాటానికి సిద్ధమయ్యారు. కాగా, పట్టణం నడిబొడ్డులో ఉన్న రూ. 10కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతోంది. సర్వేనంబర్ 111లో గల విజయ విద్యాలయ హైస్కూల్‌కు ఆనుకొని సుమారు 2వేల గజాల భూమి ఉంది. గతంలో పాఠశాలకు ఆటస్థలం కొరకు ప్రభుత్వ ఆ భూమిని వాడుకునేందుకు ఇచ్చింది. అయితే, ఆ భూమి తమదని, హక్కుదారులమని 2015 సంవత్సరంలో విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్లాట్లుగా చేసి విక్రయించే యత్నం చేశారు. పూర్వవిద్యార్థులు, స్థానికులు ముందుకొచ్చి కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లోనే హైకోర్టు పర్మినెంట్ స్టే ఇచ్చింది. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు కూడా విచారణ చేసి అది ప్రభుత్వ స్థలమని తేల్చేశారు.

మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి స్వల్ప అస్వస్థత

● అపోలో ఆస్పత్రిలో చేరిక.. నిలకడగా ఆరోగ్యం

తాండూరు, జూన్ 9: తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. కాగా, జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరానని, కార్యకర్తలు, అభిమానులెవరూ చింతించవద్దని, తన ఆరోగ్యం కుదుటపడుతోందని పేర్కొన్నారు. అయితే, తాను త్వరలో పూర్తిగా కోలుకొని తాండూరుకు వస్తానని రోహిత్‌రెడ్డి ఆస్పత్రిలో బెడ్‌పై నుంచి మాట్లాడిన ఓ వీడియో కుటుంబ సభ్యులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.

నెత్తురోడిన రహదారులు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య నస్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2.30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్ధండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.


రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెల్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.


రంజిత్(ఫైల్)

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ ఛైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ ఛైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్టు చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.


ఆయిల్ పామ్ గెలలు పరిశీలిస్తున్న హరీశ్‌రావు

ఎన్నాళ్లకెన్నాళ్లకో..!



● ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ ● 341 మంది ఎల్పీ, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లు, పీడీలుగా అప్‌గ్రేడేషన్!

వికారాబాద్/మేడ్చల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన తాజా షెడ్యూల్‌తో ఎస్‌జీటీలు, పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరనుంది. ఉద్యోగ విరమణకు మూడేళ్ల లోపు గడువు ఉన్న ఉపాధ్యాయులను తప్పనిసరి బదిలీ నుంచి మినహాయించారు. టెట్‌తో సంబంధం లేకుండా ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించనున్నారు. లాంగ్వేజ్ పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ వారికే పదోన్నతులు కల్పించనున్నారు. మల్టీజోన్-2లో జీహెచ్‌ఎంల బదిలీలు మాత్రమే జరిగాయి. స్కూల్ అసిస్టెంట్లకు పీజీహెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాల్సి ఉండగా.. కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కోర్టు కేసులతో గతంలో ఎక్కడైతే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిందో అక్కడి నుంచే ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఈనెల 8న ప్రారంభమైన ప్రక్రియ 30వ తేదీ వరకు కొనసాగనుంది. కోర్టు కేసులు, టెట్ అంశాలతో నిలిచిపోయిన జీహెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల బదిలీలు చేపట్టాల్సి ఉంది. మొదట జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించి ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తారు. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయనున్నారు. తొమ్మిదేళ్ల తరువాత పదోన్నతులు కల్పిస్తుండగా, ఆరేళ్ల తరువాత బదిలీలకు అవకాశం కల్పించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం పదోన్నతులతో భర్తీ చేయనుండగా, మిగతా 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమిస్తారు.

జీహెచ్‌ఎంలు.. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

జిల్లాలో 1,063 ప్రభుత్వ, పరిషత్తు పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 776, ప్రాథమికోన్నత పాఠశాలలు 111, ఉన్నత పాఠశాలలు 176 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 4,638 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 3,918 మంది పనిచేస్తున్నారు. జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు 94 ఖాళీగా ఉండగా, సీనియారిటీ కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించనున్నారు. వివిధ సబ్జెక్టులు, మీడియాలకు సంబంధించి జిల్లాలో 1,601 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా, ఈ పోస్టుల్లో పదోన్నతులతో 320 పోస్టులు భర్తీ చేయనున్నట్లు సమాచారం. పీఎస్ హెచ్‌ఎం 67, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ (తెలుగు మీడియం) 19, బయోసైన్స్ 35, సోషల్ స్టడీస్ 40, ఆంగ్లం 35 పోస్టులు ఉన్నట్లు సమాచారం. ఉర్దూ మీడియం పోస్టుల్లో ఎన్ని పదోన్నతులతో భర్తీ చేయనున్నారనేది స్పష్టత లేదు. జిల్లాలో 320 మంది వరకు ఎస్‌జీటీలకు వివిధ సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. పదోన్నతుల సీనియారిటీలో ముందుండే ఎస్‌జీటీలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనున్నారు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడానికి ఇష్టంలేని ఎస్‌జీటీలు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందనున్నారు. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందే వారు ఆ పాఠశాలల్లోనే పనిచేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే, భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో భాషా పండితుల్లో తెలుగు 149, హిందీ 149, ఉర్దూ 6, సంస్కృతం 1 పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆదివారం భాషా పండితుల సర్టిఫికెట్లు పరిశీలించారు. అప్‌గ్రేడ్ చేయాలనే ప్రభుత్వనిర్ణయంతో జిల్లాలో 305ఎల్‌పీటీ పోస్టులు స్కూల్‌అసిస్టెంట్ (భాషాపండితులు)గా అప్‌గ్రేడ్ కానున్నాయి.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ దేవసేన జారీ చేశారు. ఈనెల 8న జీహెచ్‌ఎం పదోన్నతులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల జాబితా ప్రకటన, 10 నుంచి 11వ తేదీ వరకు తుది సీనియారిటీ జాబితా వెల్లడి, వెబ్ ఆప్షన్ల నమోదు, పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేయనున్నారు. 12 నుంచి 13వ తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల జాబితా ప్రకటన, 16 నుంచి 18వ తేదీ వరకు స్కూల్ అసిస్టెంట్ల బదిలీల తుది సీనియారిటీ జాబితా ప్రకటన, వెబ్ ఆప్షన్ల నమోదు, 19న స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ఉత్తర్వులు జారీ, 20న స్కూల్ అసిస్టెంట్ల బదిలీల తరువాత ఖాళీల జాబితా ప్రకటన, 21 నుంచి 24వ తేదీ వరకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులైన ఎస్‌జీటీల తుది సీనియారిటీ జాబితా ప్రకటన, పదోన్నతుల ఉత్తర్వుల జారీ, 25న ఎస్‌జీటీ ఖాళీల ప్రకటన, 26 నుంచి 28వ తేదీ వరకు ఎస్‌జీటీ బదిలీల తుది సీనియారిటీ జాబితా ప్రకటన, వెబ్ ఆప్షన్ల నమోదు, 29 నుంచి 30 వరకు ఎస్‌జీటీల బదిలీల ఉత్తర్వులు జారీ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. కొత్త జిల్లాలు ఆవిర్భవించిన తరువాత 2018, జూలైలో తొలిసారిగా బదిలీలు జరిగితే, పదోన్నతులు మాత్రం 2015లో కల్పించారు.

పారదర్శకంగా పదోన్నతులు, బదిలీల ప్రక్రియ

ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం కార్యాచరణ ఉంటుంది. తాత్కాలిక జాబితాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాం. అభ్యంతరాలుంటే సంబంధిత తేదీల్లో జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్‌లో సంప్రదించాలి. **- విజయకుమారి, డీఈవో**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో

జిల్లా పరిధిలో మల్టీజోన్-2 పరిధిలో తాజా షెడ్యూల్‌తో భాషా పండితులు, పీఈటీల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ వారికే పదోన్నతులు ఇచ్చేలా షెడ్యూల్ జారీ చేయడంపై ఉపాధ్యాయ సంఘాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, గతంలో బదిలీ అయ్యి, రిలీవ్ కాని స్కూల్ అసిస్టెంట్లను కేటాయించిన పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వం శుక్రవారం ఆదేశించిన నేపథ్యంలో వారంతా శనివారం రిలీవ్ అయినట్లుగా సమాచారం. ప్రభుత్వ తాజా చర్యలపై పీఆర్‌టీయూఎస్, టీయూటీఎఫ్, తాపస్, టీపీఆర్‌టీయూ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో ఎస్టీటీ పోస్టులు.. అల్వాల్ పరిధిలో 2, బాచుపల్లి పరిధిలో 3, దుండిగల్ పరిధిలో 3, ఘట్‌కేసర్ పరిధిలో 3, కాప్రాలో 1, కీసర పరిధిలో 2, కూకట్‌పల్లిలో 1, మల్కాజిగిరిలో 1, ఎంసీపల్లిలో 1, మేడ్చల్ పరిధిలో 4, కుత్బుల్లాపూర్ పరిధిలో 7, శామీర్‌పేట పరిధిలో 2 ఖాళీలు ఉన్నట్లు తెలిసింది.

ఖర్గేతో పరిగి ఎమ్మెల్యే భేటీ



పరిగి, జూన్ 9: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గేతో ఆదివారం ఢిల్లీలో పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి కలిశారు. తెలంగాణలో శాసన సభ, లోక్‌సభ ఎన్నికల పరిస్థితులపై రామ్మోహన్‌రెడ్డి, ఖర్గేకు వివరించారు. మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు కల్పించాలని కోరారు.

బండి సంజయ్‌ను కలిసిన భాస్కరయోగి



పరిగి, జూన్ 9: కరీంనగర్ ఎంపీ, బీజేపి నేత బండి సంజయ్‌ను పరిగికి చెందిన ప్రముఖ రచయిత, విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి ఆదివారం కలిశారు. ఎంపిగా గెలిచిన సందర్భంగా కలిసి అభినందనలు తెలిపారు. కేంద్ర మంత్రిగా చూడాలని భాస్కరయోగిని అకాక్షించారు. అలాగే బీజేపి రాష్ట్ర అధ్యక్షుడు, సికింద్రాబాద్ ఎంపి కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

మేడ్చల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పంట అధిక దిగుబడికి వరి పొలంలో వేసేందుకు జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ అన్నారు. రైతులకు విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నామన్నారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సంప్రదించి తీసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం వరి, మొక్కజొన్న, కందులు, కూరగాయ పంటలు వేసుకోవడానికి అనువుగా ఉంటుందని చెప్పారు.

సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

తాండూరు రూరల్, జూన్ 9: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వర్సిటీ ఆధ్వర్యంలోని తాండూరు మండలంలోని జినుగుర్తి ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజేటీఎస్ ఏయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పాలిటెక్నిక్ కోర్సుకు ఈనెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 60సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పాఠశాల క్రీడాప్రాంగణాన్ని కాపాడాలి

తాండూరు, జూన్ 9: పాఠశాల క్రీడాప్రాంగాణాన్ని కాపాడాలని జిల్లా జనసత్తా వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ సూరత్ సింగ్ ఠాకూర్ ఓ ప్రకటనలో కోరారు. తాండూరు పట్టణం సర్వే నెంబర్ 111లో ఉన్న ప్రభుత్వ భూమిని విజయ విద్యాలయ హైస్కూల్ కోసం, క్రీడా ప్రాంగణానికి కేటాయించారని, అయితే కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమిని సొంతంగా వినియోగించుకునేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని, ఇది కోర్టును ఆర్డర్‌ను ఉల్లఘించడం అవుతుందన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కోర్టు ఆదేశాలను అమలు పరచాల్సిన రెవెన్యూఅధికారులు నిద్రావస్థలో ఉన్నారని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి జోక్యం వల్లే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. న్యాయస్థానానికి వ్యతిరేకంగా నాయకుడికి అనుకూలంగా వ్యవహరించడంపై హైకోర్టు ఆర్డర్‌ను ధిక్కరించినట్లే అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఆట్టి స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని ఆయన పేర్కొన్నారు.

భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశాం

ఘట్‌కేసర్, జూన్ 9: పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లో శ్రీవెంకటేశ్వర హౌజింగ్ సొసైటీ లేఅవుట్‌లో 2.27ఎకరాల స్థలాన్ని తాము చట్టబద్ధంగా కొనుగోలు చేశామని పోలగోని రాజేందర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, పోలగోని కొండల్ గౌడ్, వినయ్, శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం నాడు యంనంపేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 1954- 55 కాస్రా పహని నుండి అన్ని రికార్డులతోపాటు పాత, కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించే తాము 2020లో 2.27ఎకరాలను కొనుగోలు చేశామన్నారు. ఇష్టాను సారంగా అక్కడ చెత్త వేస్తుంటే హైకోర్టునశ్రయించి చెత్త వేయకుండా ఉత్తర్వులు పొందామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తమను డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు.

కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పరీక్ష

కొడంగల్, జూన్ 9: వేసవిలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులు పరీక్ష రాశారు. కొడంగల్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం స్థానిక వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు భీమరాజు పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సరిఫికెట్లు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్ష నిర్వాహకులు ప్రభాకర్, మాసాని వెంకటయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

తొలకరి వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పంట పొలాల్లో చదును చేయడం, పత్తి, కంది, జొన్న విత్తనాలు వేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులకు అనువుగా మారిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ధారూరు: ధారూరు సమీపంలో పొలంలో కట్టె ఏరుతున్న కూలీలు



నవాబుపేట: ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు



యాలాల: పొలంలో కంది విత్తనాలు వేస్తున్న రైతులు



బొంరాస్‌పేట్: వరి ధాన్యం సాగుకు నారుమడులను సిద్ధం చేస్తున్న రైతు



కొడంగల్ రూరల్: దేవరఫస్లాబాద్‌లో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



కీసర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 9: కొర్రెములలోని చెరుకుబాలయ్య గార్డెన్‌లో సాయంత్రం 1998-99 నాటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. వారి గురువులు గున్నయ్య, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరావు, నందం, పాపిరెడ్డిలను ఘనంగా సత్కరించారు.

కొడంగల్ రూరల్: హస్నాబాద్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000 ఎస్ఎస్‌సీ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తిరుమలచార్యులు, విద్యార్థులు ఉస్మాన్, వెంకటయ్య, రమేశ్‌గౌడ్, షఫీ, దశరథ్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కీసర: పూర్వ విద్యార్థుల రజోత్సవ ఆత్మీయ సమ్మేళన వేడుక ఘనంగా జరిగింది. మండల కేంద్రం కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కీసరలో ఏర్పాటు చేశారు.



కొడంగల్ రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కొర్రెములలో సమ్మేళనంలో పాల్గొన్న 1998-99 నాటి విద్యార్థులు

మున్సిపాలిటీల్లో ప్రజావాణి

కీసర రూరల్, జూన్ 9: నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయా మున్సిపల్ కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్యలు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రజావాణి కార్యక్రమాన్ని పునఃప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సమస్యలపై పురపాలక ప్రజల నుంచి వినతిపత్రాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ప్రతీ సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నుండి మధ్యాహ్నం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. మున్సిపల్ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పేర్కొన్నారు.

ఘట్‌కేసర్: ప్రతి సోమవారం మున్సిపాలిటీల్లో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని ఘట్‌కేసర్, పోచారం మున్సిపల్ కమిషనర్లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెద్దేముల్, జూన్ 9: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం రెండు గంటలపాటు కరెంటు సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ డీఈ భాను ప్రసాద్ తెలిపారు. తాండూరులోని 220/132/33 కేవీ ఉపకేంద్రంలో మరమ్మతులు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మంబాపూర్, ఇందూరు, గాజీపూర్, తట్టెపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. తాండూరు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తాండూరు: తాండూరు విద్యుత్ కేంద్రంలో మరమ్మత్తుల కారణంగా నేడు తాండూరులో ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈ భానుప్రసాద్ తెలిపారు. తాండూరు పట్టణం, పాత తాండూరు పరిధితో పాటు పెద్దేముల్ మండలం మంబాపూర్, ఇందూరు, గాజీపూర్, తట్టేపల్లి, తొర్మామిడి, యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్, దౌలాపూర్ ఉపకేంద్రాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పాడుతుందని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

వికారాబాద్, మే 9: వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని ధన్నారం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జస్టిస్ కొండా మాదవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అపోలో ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ హెల్త్‌క్యాంపులో గ్రామస్తులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి సాయిచరణ్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కీసర: అక్షర యోధుడు రామోజీరావు మృతిపట్ల మండల టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మండలంలోని భోగారం గ్రామంలో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుంకరి వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పత్రికా, సినీ రంగాలతో పాటు అనేక రంగాల్లో ఎదురులేని ధీశాలి రామోజీరావు అని ఘట్‌కేసర్ మండల టీడీపీ మండల అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయన అడుగుపెట్టిన అన్నిరంగాల్లో విజయం సాధించిన గొప్ప వ్యక్తిని కొనియాడారు. ప్రధానంగా పత్రికా, టీవీ రంగాల్లో ఆయన కృషి మరువలేనిదన్నారు. నేటి యువత ఆమహనీయున్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టా సూర్యనారాయణ, పాటి సురేందర్‌రెడ్డి, కట్కూరి నర్సింగరావు, అబ్బగోని మురళి పాల్గొన్నారు.

కీసర: దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోడీ చిత్రపటానికి బీజేపీ మండల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్ యాదవ్, బాపిరెడ్డి, సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, మెట్టు కృష్ణ, చినింగని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: దేశ రక్షణకు, ధర్మం కోసం ప్రజలు దేశవ్యాప్తంగా బీజేపీని గెలిపించారని, చేవెళ్ల ప్రజలు ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారని బీజేపీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో అన్నిగ్రామాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేశారని, 600పై చిలుకు ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎం.రమేశ్ పాండుగౌడ్, విశ్వనాథం, వివేకానంద రెడ్డి, రాజేందర్ గౌడ్, కృష్ణ, రాజునాయక్, నందు, కె. అంజయ్య, వెంకటయ్య, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలుకింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 9: ఓ గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 25 నుంచి 30వయసు గల ఓ గుర్తుతెలియని యువకుడు అవుషాపూర్ 221/13-15 మైలురాయి వద్ద వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడి శరీరం నుంచి తల, మొండెం వేరుగా పడిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని, పరిసరాలను పరిశీలించారు. అయితే అతడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పాముకాటుతో ఇంటర్ విద్యార్థిని మృతి



పూజ(ఫైల్)

తాండూరు రూరల్, జూన్ 9: పాముకాటుతో ఓ ఇంటర్ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన తాండూరు మండలంలోని ఓగీపూర్ సమీపంలోని నాపరాతి క్వారీలో ఆదివారం చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం అల్లాకోట్‌కు చెందిన ఎడెల్లి రవి తన కుటుంబంతో కలిసి ఓగీపూర్ నాపరాతి క్వారీలో నివాసముంటున్నాడు. అక్కడే పాలిషింగ్ యూనిట్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నారు. అయితే రవి కూతురు పూజ(16) జినుగుర్తి సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతోంది. సెలవులు కావడంతో తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. శనివారం అర్ధరాత్రి 1గంట సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా, పూజ కుడికాలుకు పాము కాటేసింది. వెంటనే పూజ అరవడంతో తల్లిదండ్రులు లేచి చూడగా పాము కనిపించింది. పూజను తల్లిదండ్రులు వెంటనే తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పూజపరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు తరలించారు. అయితే, పూజ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, జూన్ 9: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం సమస్తిపూర్‌కు చెందిన సికేంద్ర కుమార్(21) ఆరు నెలల కిందట తమ్ముడు సునీల్ కుమార్‌తో కలిసి మండలంలోని యాడారం గ్రామంలో వెంకట రామకృష్ణ రాజువద్ద వ్యవసాయ పనులు చేయడానికి చేరి పొలం వద్ద ఉన్న లేబర్ రూమ్‌లో ఉంటున్నారు. శనివారం రాత్రి సికేంద్ర కుమార్ ఫోన్‌లో తన తల్లితో మాట్లాడుతూ గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తీరా రాత్రికి ఇంటికి తిరిగి రాకపోవటంతో అతడికోసం గాలించగా ఆదివారం ఉదయం వ్యవసాయ పొలం సమీపంలోని చింతచెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతుడి తమ్ముడు సునీల్ కుమార్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. సికేంద్రకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీధర్ తెలిపారు.

ఈవీఎల్ కార్మికుల సంక్షేమానికి కృషి

మేడ్చల్ టౌన్, జూన్ 9: ఈవీఎల్ కార్మికుల సంక్షేమానికి తనవంతు పూర్తి సహాయసహకారాలు అందిస్తానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈనెల 20వ తేదీన మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఈవీఎల్ పరిశ్రమ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం మర్రి రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌టీయూ నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేకర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంబు ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈవీఎల్ కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడే రాజశేఖర్‌రెడ్డికి ఓటువేసి గెలుపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో చక్రం గుర్తు తమకు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు విఠల్, రమేష్, నరసింహాచారి, వీఎస్.చారి, వి.యాదగిరి, గోపాల్, ఎస్.శ్రీనివాస్, ఆర్.సుధాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవం

కొడంగల్, జూన్ 9: ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కొడంగల్‌లో ఆదివారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నాయకులు జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యండీ.షఫీ, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దయాకర్, ఆశప్ప, గోపాల్, కన్నచారి, లక్ష్మీనారాయణ, అంజిలయ్య, రమేశ్ పాల్గొన్నారు.

బైక్ రైడింగ్‌తో యువతలో ఆత్మస్థైర్యం

మోమిన్‌పేట్, జూన్ 9: జాతీయ చాంపియన్‌షిప్ బైక్ రైడింగ్ ద్వారా యువతలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని మోమిన్‌పేట్ ఎస్‌ఐ అరవింద్ అన్నారు. మండలంలోని మల్లారెడ్డిగూడ, గోవిందాపూర్ శివారు ప్రాంతాల్లో ఎంఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 20 కిలో మీటర్ల బైక్ రైడింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ రాజశేఖర్‌తో కలిసి ఎస్‌ఐ ఆనంద్ బైక్ రైడింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన యువతీ, యువకులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను మండల కేంద్రంలోని బీకేఆర్ ఫంక్షన్ హాలులో అందజేశారు. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 66 మంది యువతీ, యువకులు పాల్గొనగా అందులో నలుగురు మహిళలు ఉన్నారు.

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల కమిటీ ఎన్నిక

బొంరాస్‌పేట్, జూన్ 9: వికారాబాద్ జిల్లా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులు జిల్లా కేంద్రంలోని హరితరిసార్ట్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఆగ్రోస్ రైతు సేవ కేంద్రాల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌గుప్త, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, ట్రెజరర్‌గా శశిధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా విశ్వేశ్వర్‌గౌడ్, పులేందర్‌రెడ్డి, నవాబుపేట కార్యదర్శులుగా ఫరీద్, దుద్యాల లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాలు

మర్పల్లి, జూన్ 9:మండలంలోని పంచలింగాలలో గోవిందమాంబ మద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, హోమం, మధ్యాహ్నం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష



ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగు కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

పరిగి, జూన్ 9: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష పరిగిలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరిగిలో పల్లవి డిగ్రీ కళాశాల, కేటీఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో 846 మంది అభ్యర్థులకు గానూ 651 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలు రాశారు. నిమిషం తేడా నిబంధన పెట్టడంతో అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలకు తొమ్మిది గంటలలోపే చేరుకున్నారు. పల్లవి కళాశాలలో 360 మందిని కేటాయించగా 288 మంది పరీక్ష రాశారు. కేటీఎస్ స్కూల్‌లో 504మందికిగానూ 381 మంది పరీక్షలు రాశారు. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోష్‌లు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. మేడ్చల్‌లో ఆరుసెంటర్లు ఏర్పాటుచేశారు. 5664 అభ్యర్థులకు గానూ హితమ్ కళాశాలలో 605 మంది, సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 636మంది, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో 616మంది పరీక్షలకు హాజరయ్యారు.

ఘట్‌కేసర్ రూరల్: మండలంలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఘట్‌కేసర్ మండలం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని 16 కేంద్రాల్లో 12, 326 మందికి గాను 8,750 మంది పరీక్షలు రాయగా 3, 576 మంది అభ్యర్థులు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద సీఐలు సైదులు, రాజువర్మలు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఒక్క నిమిషం అలస్యమైన అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. ఏసీపీ విజయ్‌కుమార్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.